# నవ్వులో ఏడుపు

మండువాలోకి వచ్చి అక్కడ గంగాళంలో వున్న నీళ్ళు ముంచుకుని ముఖం కడుక్కోవడం మొదలెట్టింది రమ. ఎండకి చెమట పట్టి ముఖం దుమ్ము అతుక్కుపోయి జిడ్డుగా, అసహ్యంగా ఉంది. చల్లని నీళ్లతో ముఖం కడిగిన కొద్దీ హాయిగా వుంది. కళ్ళు మూసుకుని రెప్పల మీంచి నీళ్ళు జారుస్తుంటే, రంగు రంగుల వలయాలు తమాషాగా, కదులుతున్నాయి. ఆ రంగుల్లోంచి రాజా ముఖం అందంగా దర్పంగా, దర్జాగా -

అతని చూపులోంచి మెరుపులాంటి భావేమదో శరీరమంతా సర్రున పాకింది. మెరుపునంటి పెట్టుకుని ఉరిమే ఉరుములా గుండె ఝల్లుమంది.

రమ అలా చల్లని నీళ్ళతో ముఖం కడుక్కుంటూనే ఉంది. అలసట తీరుతున్నట్టు గానూ ఉంది. ఇంట్లోకి అడుగుపెట్టగానే కన్పించే పాతగా నల్లగా మాసిన చెక్క పడక్కుర్చీ, కవాచీ బల్ల, దుమ్ము రంగులోకి మారిన పాత పుస్తకాలూ కనిపించకుండా హాయిగా అందంగా మరో లోకమేదో చూస్తున్న ఆనందం కలిగింది.

గట్టిగా వినిపించిన తల్లి గొంతు రమని ఊహల్లోంచి కిందకి పడేసింది.

"ఏమీ కాలేదు. ఏమౌతుంది? ఆ పిల్లాడు మన రమ కంటే నాలుగు నెలలు పెద్దట. అయినా కుదరదని చెప్పేశాం -వదులుకున్నట్టే-"

అమ్మ అంతగా అరుస్తూ గట్టిగా చెప్తోందంటే అది బామ్మకి చెప్తోందన్నమాట. కల చెదిరినట్టయి కళ్ళు తెరిచింది రమ. కొంగుతోనే ముఖం తుడుచుకుంటూ

రెండడుగులు వేసింది. అమ్మ మాటలు విన్నాక, అమ్మకెదురుగా పడాలంటే ఎలాగో విసుగ్గా వుంది రమకి.

"ఆ పిల్లాడు దీనికంటే నాలుగు నెలలే పెద్దట" అన్న మాటలు సూదుల్లా గుచ్చుకుంటున్నాయి.

అత్తగారికి కాఫీ ఇచ్చి గదిలోంచి బయట కొస్తూ కూతురు రమని చూసి "వచ్చావా! స్టవ్ దగ్గర కాఫీ పెట్టాను వేడిగానే వుంది తాగు" అంటూ వేరే పనివైపు వెళ్ళిపోయింది తులసి.

❖ ❖ ❖

అది మహా పల్లెటూరు కాదు. అలాగని పట్టణమూ కాదు. పల్లెటూరి వాతావరణంలో పట్టణ జీవిత పోకడలతో అన్నీ వుండి ఏదో లేనట్టు, ఏదీ లేకపోయినా అన్నీ వున్నట్టూ కలగా పులగంగా వుంటుంది. కాలేజీలు, సినిమా హాళ్ళు - షాపింగ్ కాంప్లెక్స్‌లు - పబ్లిక్ స్కూళ్ళు, రెసిడెన్షియల్ కాలేజీలు, ఆడపిల్లలు హాస్టళ్ళూ - అద్దకాల కంపెనీలు - అన్నీ డిపార్టుమెంట్లూ అమర్చిన తమ తమ బ్రాంచి ఆఫీసులు - అందులో ఆడవాళ్ళు - ఉద్యోగాలు-

మగాళ్ళ కనిపిస్తే ఆడవాళ్ళు తలొంచుకుని తప్పుకోవడాలు - ఆడపిల్లలు పెద్దవగానే పరికిణీ ఓణీ వేసుకొని, చీర కట్టుకోవడాలు - మోడరన్ డ్రస్‌లు ఎట్టి పరిస్థితులలోనూ వేసుకోవడానికి ధైర్యం చేయకపోవడాలు - బిగుతుగా జడలు వేసుకుని నమ్రతగా ఆడపిల్లలు పోస్టు గ్రాడ్యుయేషన్లు కూడా చేసెయ్యడాలు - ఆషాఢ మాసపు గోరింటాకులు - శ్రావణ మాసపు నోములు పేరంటాలు -

ఇలా ఆ వూరొక పల్లె పట్టణం. రమ బి.ఏ. ప్యాసయి ఈ మధ్యనే ఎల్.ఐ.సి.లో గుమాస్తాగా చేరి అదే వూరి బ్రాంచాఫీసులో పోస్టింగ్ సంపాదించి పొందికగా వుద్యోగం చేస్తోంది.

మూడు రోజుల క్రితమే రమకి ఇరవై నాలుగేళ్ళు నిండి ఇరవై అయిదు వచ్చింది. ఆ పుట్టిన రోజున రమ ఉత్సాహంగా ఉందామనుకునే అనుకుంది. తన సొంత డబ్బులతో మొదటిసారి పదిహేను వందల రూపాయల చీర కొనుక్కున్నందుకు గర్వంగా తిరుగుదామనే అనుకుంది. కానీ ఎందుకో తల్లి దగ్గర నుంచీ అందరూ ఆ రోజు రమ పెళ్ళి గురించి చర్చలతో, వాదాలతో చిరాకు కలిగించారు.

"చీరలు కొనుక్కోవడాలు, ఉద్యోగం, జీతం, అన్నీ బాగానే ఉన్నాయి. వయసు మీరిపోతుంటే పెళ్ళి చెయ్యాలి మరి. ఆ తండ్రికి నేనెన్నిసార్లు చెప్పినా చెవికెక్కడం లేదు" అంటూ తులసి సుప్రభాతంతో తెల్లవారింది.

ఆ సాయంత్రం ఎంతో ఆలోచించి, ధైర్యం కూడదీసుకుని రమే చెప్పింది తల్లికి– రాజా అనే రాజాలాంటి పెళ్ళికొడుకు ఉన్నాడనీ, వెళ్ళి మాట్లాడమనీ –

❖ ❖ ❖

రమ కాఫీ గ్లాసు పుచ్చుకుని నెమ్మదిగా బామ్మ గదిలో అడుగుపెట్టింది. రమకి ఆ ముసలి బామ్మంటే ఎక్కడలేని ఎడ్మిరేషను. ఆమెకున్న తెలివి, ఉత్సాహంలో ఆరోవంతు తనకున్నా తనెంతో సాధించగలదు. కానీ....

అలికిడి విని "ఎవరూ రమేనా" అంది భారతీదేవి. రమ బామ్మ దగ్గరగా వెళ్ళి "నీకు చెముడంటారు. నేనెంత నెమ్మదిగా వచ్చినా కనిపెట్టేశావే బామ్మా!" అంటూ ఆమె పక్కనే కూర్చుంది.

"ఎవరే నాకు చెముడన్నది? గొడవగా, గోలగా వున్నప్పుడు ఎవరు మాట్లాడినా అర్థం కాదు గానీ, నిశ్శబ్దంగా వున్నప్పుడు చీమ చిటుక్కుమన్నా వినిపిస్తుంది", అంది ధీమాగా.

ఆమె స్వాతంత్ర్యోద్యమ కాలంలో పుట్టిందని ఆమెకి భారతమాత అని పేరు పెట్టార్ట. చిన్నపిల్ల మాతా గీతా ఏమిటని, ఆ తర్వాత దాన్ని దేవిగా మార్చారట.

బామ్మ ధీమా కబుర్లకి రమ పకపక నవ్వింది.

బామ్మకి మాట వినిపించదు. కానీ చెముడు లేదంటుంది. కన్ను ఆనదు. అయినా తను శుభ్రంగా చూడగలను అంటుంది. 'నువ్వు పెద్దదానవు నడవలేవు" అంటే నడవలేనంత వయసేం లేదు' అంటూ ఖండిస్తుంది. అందుకే రమకి బామ్మని చూస్తే సరదాగా, యిష్టంగా ఉంటుంది. తల్లి తులసికి విసుగ్గా, చిరాగ్గా ఎందుకుంటుంది రమకి అర్థం కాదు.

"నీకంటే ఆ కుర్రాడు నాలుగు నెలలే పెద్దటగా– అందుకే వీళ్ళు రాజాలాంటి సంబంధం వదిలేసుకున్నార్ట" అంది భారతీ బామ్మ.

"అసలు భార్య కంటె భర్తకి వయసెందుకెక్కువ ఉండాలి బామ్మ" అంది రమ కాఫీ తాగుతూ –

భారతి బోసి నోటితో ముసిముసిగా నవ్వింది. కాంతిలేని, చూపు ఆనని కళ్ళు రమని గుచ్చి చూశాయి. కనురెప్పలు అల్లల్లాడించింది. ఊడిన పళ్ళ మధ్యలోంచి నాలుక బయటకి పెట్టి రెండుసార్లు చప్పరించి నెమ్మదిగా సాలోచనగా–

"ఉండాలే – మరి వుండద్దూ – భార్యని చెప్పుచేతల్లో పెట్టుకోవడానికి వాడిక్కాస్త వయసెక్కువే వుండాలి" అని కాస్సేపాగి "నాకూ మీ తాతగారికి పద్నాలుగేళ్ళు తేడా" అని నవ్వడం మొదలుపెట్టింది. బామ్మ ఎందుకలా నవ్వుతుందో అర్థం కాలేదు రమకి. అయినా ఆమెని చూస్తూ కూర్చుంది. ఆ నవ్వు క్రమంగా విచిత్రమైన బాధగా, దుఃఖంగా మారుతుంటే రమకి భయమేసింది.

"ఏమిటే ఆ నవ్వు" – అంది రమ.

"నేను నవ్వుతున్నానటే – నవ్వుకీ, ఏడుపుకీ తేడా తెలీదు మీ కుర్రాళ్ళకీ –

"అవునూ, నీకూ తాతయ్యకీ ఎందుకంత తేడా?"

"ఎందుకంటే? అందుకే – నాకు ఎనిమిదేళ్ళు. మీ తాతయ్యకి 22ఏళ్ళు"

"అంటే" అంది రమ ఆశ్చర్యంగా

అంటే లేదు గింటే లేదు – ఆడపిల్ల అరటి చెట్టులా ఎంతలోకెదిగొస్తుందీ..." అని కాస్సేపాగి "అసలేం జరిగిందంటే" అంటూ బామ్మ గతంలోకి వెళ్ళిపోయింది.

❖ ❖ ❖

భారతికి ఎనిమిదేళ్ళు నిండగానే ఇంట్లో అందరూ గంగవెర్రులెత్తినట్టు కంగారు పడడం మొదలుపెట్టారు. ఆడపిల్లకి పెద్ద మనిషి కాకుండా పెళ్ళి చెయ్యకపోతే వూళ్ళో సాటివాళ్ళు వెలివేస్తారు. ఎంత గాలించినా సరైన సంబంధం కుదరడం లేదు. అదీ గొడవ. అలాంటి సమయంలో నరసింహం వాళ్ళకి దొరికాడు. అతనికి ఏడాది క్రితం భార్య పోయింది మసూచి వల్ల. ఆ పోయిన భార్య వయసు కూడా పన్నెండేళ్ళు. అంతే – ఈ ఎనిమిదేళ్ళ భారతి నరసింహం భార్య అయి కూర్చుంది. ఇరవై రెండేళ్ళ నరసింహం బొటాబొటీ అయిదడుగులు ఎత్తూ, గుండ్రంగా గుండుపిక్కలా ఇంటిల్లిపాదికీ ఆపద్బాంధవుడిలా కనిపించాడు.

పెళ్ళి హడావిడిగా జరిగినా, ఆర్భాటంగానే జరిగింది. తంతు ముగియగానే "పిల్ల ఎప్పుడుపయోగానికొస్తుందా" అని మగపెళ్లి వారు బాహాటంగానే ప్రశ్నించారు.

"అది మన చేతుల్లో లేదు కదా" అంటూ చేతులు పిసుక్కున్నారు ఆడపెళ్లివారు.

లొట్టలేసుకుంటూ ఇంటి చుట్టూ తిరుగుతున్న అల్లుడ్ని చూసి ఏం చెయ్యలేక

"ఈ దిక్కుమాలిన ముండ త్వరగా పెద్దదై కూర్చున్నా బాగుండును" అని కూతుర్ని శాపనార్థాలు పెట్టాడు భారతి తండ్రి.

"అదేం చేస్తుందీ - దాని చేతిలో పని కనుకనా" అని అడిగినందుకు "ఆడదానివై వుండి అడ్డు ప్రశ్న వేస్తావా" అని భార్య మూతి బద్దలు కొట్టాడు మగమహారాజు.

భయంకరంగా కనిపిస్తున్న తన జీవన ప్రాంగణాన్ని చూసి ఏమీ అర్థం చేసుకోలేని అయోమయంలో పడిపోయింది ముక్కుపచ్చలారని ఎనిమిదేళ్ళ భారతి.

అనుకున్న దానికన్నా ముందుగానే ఆమె అందరి ఆశలూ తీర్చింది. ఆ నాలుగు రోజులు వేడుకలు - అత్తవారి కానుకలు బాగానే వున్నాయి.

అయిదోనాడు కబురు - కన్నతల్లి కళ్ళనీళ్ళు పెట్టుకుంది. "పసిపిల్ల దానికేం తెలీదు. అర్భకంగా ఉంది" అంది.

"ఇంతకాలం ఆగారు. ఇంకా ఆగమంటే ఒక్క నిముషం ఆగరు. పసిపిల్లయినా అర్భకంగా వున్నా అన్నీ అతనే చూసుకుంటాడు. ఓ అయ్య చేతిలో పెట్టాక మంచీ చెడ్డా వాళ్లదే" అన్నాడా తండ్రి.

"దానికేం తెలీదు" మళ్ళీ రెట్టించింది ఏలాగైనా కాస్త అడ్డగిద్దామని.

"నోరు ముయ్. అన్నీ అతనే చెప్పుకుంటాడు. అనుభవంతో అదే తెలుసు కుంటుంది. నీకు మాత్రం మొదట్లో ఏం తెలిసి చచ్చింది..."

"మూడుసార్లయినా కాకుండా" నసిగింది.

"ఓసే ముదనష్టపుదానా! ముండల్ని బట్టి పోయేట్టున్నాడే అల్లుడూ - నోరు మూసుకుని పని చూడు" అరిచాడు.

పసిపిల్ల మీద అత్యాచారానికి సుమూర్తం నిర్ణయించారు పెద్దలు. ఏదో తెలియని భయంతో, ఆవేదనతో కంటికి మింటికీ ఏకధారగా ఏడుస్తున్న భారతిని బలిపశు వులా గదిలోకి తోశారు.

ఆకలిగొన్న పులివున్న బోనులోకి నెట్టబడిన మేకపిల్లలా గజగజలాడిపోయింది భారతి.

తాటాకు బొమ్మకు చీరకట్టి నగలు పెట్టినట్లు రెపరెపలాడుతున్న ఆ పసిదాన్ని పాశవికంగా పడతోశాడా కామాంధుడు. రక్తం మడుగులైతే భయంతో భరించలేని బాధతో గగ్గోలు పెట్టేసింది భారతి. అయినా బయట గొళ్ళాలు వేసిన తలుపులు తెరుచుకోలేదు. ఆమెను కబళిస్తున్న కబంధ హస్తాలు సడలనూ లేదు.

బామ్మ పెద్దగా నోరు తెరిచి గట్టిగా అరుస్తోంది.

రమ ఒళ్ళంతా ఒణికిపోతోంది బామ్మని చూస్తుంటే ఆగని కన్నీళ్ళు చెంపలంట ధారలు కట్టేశాయి. తనెక్కడున్నదో - తనేం చేస్తున్నదో తెలీకుండా బామ్మని వాటేసుకుని భోరున ఏడుస్తోంది.

బామ్మ మాట్లాడుతూనే ఉంది.

"మొగుడు పెళ్ళాం కంటే ఎంత వయసులో పెద్దవాడయితే అంతగా అధికారం చలాయించగలడు. అంతగా హింసించగలడు. అంతగా నోరెత్తకుండా తన మార్గానికి తిప్పుకోగలడు.

"బామ్మా! బామ్మా" అని ఏడుస్తోంది రమ. "ఊరుకోవే".

"అవునే- వాడు ముసలాడయినా యిదీ ముసలిదైతే ఎలా? వాడు ముసలాడై అన్నీ వుడిగిపోయే వరకు ఇది పక్కలోకి పనికి రావాలి - అందుకు అబ్బాయికంటె అమ్మాయి చిన్నదై అయుండాలి - వాడు మంచాన పడితే ఓపిగ్గా, పడీ పడీ చాకిరీ చెయ్యాలంటే మొగుడి కంటే పెళ్ళాం చాలా చిన్నదే అయుండాలి".

.....................

"ఒకే వయసుదైతే నీ లెక్కేమిటంటుంది చిన్నదైతే మగాడి ప్రతి ఆలోచననీ తు.చ. తప్పకుండా ఆచరిస్తుంది. అతన్ని అనుసరిస్తుంది. పెద్దవాళ్ళు చెప్పినట్టు చిన్నవాళ్ళు వినాలిగా - భర్త చెప్పినట్టు భార్య వినాలిగా - మరందుకే వాడు సరిసమానమైతే ఎలా? మొట్టికాయలెలా వేయడం? అందుకే... అందుకే" బామ్మ నవ్వుతూ మొదలుపెట్టిన కథ క్రమేపీ దుఃఖంగా మారిపోయింది. దుఃఖంతో కూడిన ఆమె నవ్వు గుండెలు చీల్చేలా వుంది.

"బామ్మ - బామ్మా నువ్వు నవ్వకే - నువ్వు నవ్వితే నాకు భయమేస్తుంది".

"నేను నవ్వుతున్నానా? అదేనే చెప్పేది. నవ్వుకీ ఏడుపుకీ మీకు తేడా తెలీదనే నే చెప్పేది - నేనేడుస్తున్నానే తల్లీ"

"ఆ రెండో రాత్రి నన్ను గదిలోకి పంపనని మొండికేసిన అమ్మ తిన్న తన్నులు నెల్లాళ్ళకి సరిపోయాయి.

మరి అమ్మ కూడా నాన్నకంటే వయసులో చాలా చిన్నది కదా!" మహావ్యంగ్యంగా గుండెలు బద్దలు కొట్టేలా అంది.

"ఏమిటే రమా! ఏమిటా గోల. ఆవిడ కసలే మతిస్థిమితం లేదు. నువ్వేమిటలా ఏిడ దగ్గర కూర్చుని రాగాలు తీస్తున్నావు" దూరంగా తులసి గొంతు వినిపించింది.

"మీ అమ్మకి బుద్ధి లేదు. ఆడదాన్ని అర్థం చేసుకుంటే ఇన్ని అనర్థాలు రావు. నాలుగు నెలలే పెద్దవాడైతే నష్టమేం లేదు. చెప్పు. కొంపలేం మునిగిపోవని గట్టిగా చెప్పు. సీతమ్మవారి కంటే రాముడు ఏడుళ్ళు చిన్నవాడని చెప్తారుగా అని దబాయించి అడుగు" బామ్మ రొప్పుతోంది.

అవును ఆధునిక వైద్యశాస్త్రం కూడా ఈ విషయంలో నెగటివ్‌గా చెప్పిందేం లేదు అనుకుంది రమ.

తులసి వచ్చి లైటు వేయడంతో గది నిండా వెలుగుపరచుకుంది. ఆలోచన వెలుగై రమ మదిలోనూ నిండింది.

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 22.3.1996)